క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం



కురవి: సీరోలు మండలంలోని చింతపల్లి గ్రామ శివారు పెద్ద లాల్ తండాకు చెందిన భూక్య రవికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'డిజైన్ అండ్ పెర్ఫార్మెన్స్ ఇవాల్యుయేషన్ ఆఫ్ మాగ్నేటిక్ కపులింగ్ కాయిల్స్ ఫర్ వైర్లెస్ చార్జింగ్ సిస్టం విత్ డిఫరెంట్ కాన్ఫిగ్యూరేషన్స్'పై పత్రాన్ని సమర్పించారు. దీంతో యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు వివరించారు.

జాతీయ స్థాయికి ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: మానుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న కొర్ర పూజేష్ మైసూర్‌లో ఈనెల 31న జరగనున్న జాతీయ సమైక్యత క్యాంపునకు ఎన్ఎస్ఎస్ తరఫున ఎన్నికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు శనివారం తెలిపారు. ఈనెల 21న కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. దీంతో విద్యార్థిని కళాశాల బృందం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, రత్నమాల, రాజేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఎస్టీఐగా రజిత



తొర్రూరు: తొర్రూరు ఆర్టీసీ డిపో ఎస్టీఐగా జి.రజితను సంస్థ ఉన్నతాధికారులు నియమించారు. శనివారం డివిజన్ కేంద్రంలోని డిపో కార్యాలయంలో నూతన ఎస్టీఐగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్టీఐగా విధులు నిర్వహించిన బోయేజ్‌కుమార్ పదోన్నతిపై కరీంనగర్ డిపోకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఖమ్మం డిపోలో పని చేస్తున్న రజితను తొర్రూరు డిపోకు బదిలీ చేశారు.

విరాళం అందజేత

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో వచ్చే నెల ఫిబ్రవరి 2న నిర్వహించనున్న లింగమంతుల జాతర పండుగకుగాను, గ్రామానికి చెందిన మేకల వీరన్నయాదవ్, సురేష్ రూ.11,116ల విరాళాన్ని శనివారం యాదవ సంఘం పెద్దలకు అందజేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం




నెల్లికుదురు: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)లో డ్రైవర్‌గా పనిచేస్తున్న మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన అమీర్ పాషా తెలంగాణ ఐఓసీ బెస్ట్ డ్రైవర్‌గా రెండో ర్యాంకు సాధించాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐఓసీ నుంచి ప్రశంస పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా గ్రామంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని సత్యపాల్ రెడ్డి, గ్రామస్తులు నజీం, కృష్ణమూర్తి, శివ, సురేష్, యాకన్న సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు..




మహబూబాబాద్ రూరల్: ఉత్తమ ఎంపీపీఎస్, ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులను చోక్లాతండా గ్రామంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ ప్రియాంక, కార్యదర్శి సుందర్, ఉప సర్పంచ్ వీరన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కి..



మరిపెడ రూరల్: మరిపెడ మండలం గిరిపురం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. ఈసందర్భంగా సర్పంచ్ పెద్దబోయిన జనార్దన్‌ను గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో రంగయ్య, మాజీ సర్పంచ్ లాల్యానాయక్, వార్డు సభ్యులు జ్యోతిదేవ్, బావుసింగ్, శంకర్, భద్రు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి..



మరిపెడ: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల తెలుగు అతిథి అధ్యాపకుడు మాచిడి సంతోష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈసందర్భంగా శనివారం ప్రిన్సిపాల్‌తోపాటు మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, అధ్యాపక బృందం ఘనంగా సత్కరించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



డోర్నకల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్: రూ.26కోట్ల ప్రత్యేక నిధులతో డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కోరారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం జరిగిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మహబూబాబాద్ పర్యటన సందర్భంగా డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25కోట్లు కేటాయించారని, పాలకవర్గం మున్సిపాలిటీలో చేపట్టే అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులను అడ్డుకొని ఇబ్బందులు కలిగించొద్దని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపాలిటీ సమావేశ అజెండాపై చర్చ కొనసాగించారు. పన్నుల వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. విద్యుత్ సామగ్రి చోరీ చేసిన వారిపై కేసు నమోదు చేయాలని సీఐ వెంకటరత్నంను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కమిషనర్ కె.శ్రీనివాసరావు, మేనేజర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. గణతంత్ర వేడుకల్లో ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసపత్రాలను అందుకున్న కమిషనర్ శ్రీనివాసరావు, సీఐ వెంకటరత్నంను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.

అధికారులు సక్రమంగా పనిచేయాలి

నర్సింహులపేట: మండలంలోని అధికారులు సక్రమంగా పని చేయాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సభలో మాట్లాడారు. మండలంలో పని చేస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, పని చేయని వారిపై చర్యలు తప్పవని సభలో అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పింకేష్‌కుమార్, ఎంపీపీ టీకుల సుశీల, ఏపీసీఎస్ చైర్మన్ సంపెట రాము, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ వివేక్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'దళితబంధు' అమలు చేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్: దళితబంధు కోసం కేటాయించిన నిధులను తక్షణమే విడుదల చేసి అర్హులందరికీ అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాంమూర్తి మాట్లాడుతూ.. 2022లో దళితబంధు కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1770కోట్లు కేటాయించి ప్రతి నియోజకవర్గానికి 1500 మందిని ఎంపిక చేస్తామని ప్రకటించి ఆ తర్వాత 500 మందికి కుదించి 200 మంది అని మాట మార్చిందన్నారు. కార్యక్రమంలో యాకయ్య, మహేందర్, ఎల్లయ్య, భిక్షం, వెంకటేశ్వర్లు, ముత్తయ్య, ఫణిందర్, తదితరులు పాల్గొన్నారు.

'అనధికార లేఅవుట్లను ఉపేక్షించబోం'

తొర్రూరు: అనధికారికంగా లేఅవుట్లు ఏర్పాటు చేస్తే ఉపేక్షించబోమని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సింగారపు కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వెలిసిన అక్రమ వెంచర్లను మున్సిపాలిటీ సిబ్బంది పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. టీఎస్ బీపాస్‌లో అనుమతికి దరఖాస్తు చేసుకుని అన్ని అనుమతులు పూర్తయ్యాకే నిర్వాహకులు వెంచర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, సిబ్బంది రాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్: పట్టణంలో ఫిబ్రవరి 5వ తేదీన జరగనున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం పోస్టర్లను శనివారం శ్రీఅయ్యప్పస్వామి దేవాలయ ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ తాటిపాముల నర్సింహమూర్తి, వైస్ చైర్మన్ ఫరీద్, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, వెంకన్న, అజయ్‌సారథిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో అవార్డులు

మహబూబాబాద్ రూరల్: మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలు తీసుకుని జీవనోపాధి పొందుతున్నారని తద్వారా ఉత్తమ సేవకుల అవార్డులు పొందారని డీఆర్‌డీఏ, సెర్ప్, ఐకేపీ ఏపీఎం తిలక్ అన్నారు. మహబూబాబాద్ మహాలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తిలక్ మాట్లాడారు. ఈ సమావేశంలో మహాలక్ష్మి మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి విజయ, కోశాధికారి లలిత, ఉపాధ్యక్షురాలు విజయ, సీసీలు రూపాదేవి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం సరికాదు



మాట్లాడుతున్న వీరన్న

తొర్రూరు: ఈజీఎస్ జాబు కార్డుకు ఆధార్ అనుసంధానం సరికాదని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంజంపల్లి వీరన్న అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో వీరన్న మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై మార్చి 23న ధర్నా చేపడుతామన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఉమ్మగాని సత్యం, జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఆవుల కట్టయ్య, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గుగులోత్ సూర్యప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశం సింహాద్రి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులు పాలిటెక్నిక్ వైపు మొగ్గు చూపుతున్నారని, జిల్లాలో కళాశాల లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లలేక సాంకేతిక విద్యకు దూరమవుతున్నారన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు రాజేష్, ఉపేందర్, నితిన్, వినోద్, ప్రవీణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి రూ.50వేల ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న దాత, ఎస్సై, ప్రజాప్రతినిధులు

నెల్లికుదురు: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన మండల కేంద్రానికి చెందిన డొనికెని జాహ్నవికి గ్రామానికి చెందిన స్మైలీ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ కోరుకొప్పుల మహేష్ గౌడ్ రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు. నగదును తన తండ్రి రాములు గౌడ్, ఎస్సై పత్తిపాక జితేందర్, సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి చేతుల మీదుగా జాహ్నవికి అందించారు.

భక్తిశ్రద్ధలతో నగరసంకీర్తన, పంబారట్టు



కేసముద్రం: అయ్యప్ప నగరసంకీర్తనలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం: మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భక్తిశ్రద్ధలతో నగరసంకీర్తన, పంబారట్టు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం అష్టద్రవ్య గణపతి హోమం, బింబశుద్ధి, ఉత్సవబలి నిర్వహించారు. కేసముద్రంస్టేషన్‌లోని ధర్మశాస్త ఆలయం నుంచి రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహన్ని, కేసముద్రంవిలేజ్ పెద్దచెరువు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నగరసంకీర్తనలో మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డాక్టర్ సీతామహలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అయ్యప్పనామస్మరణ మధ్య పెద్దచెరువులో పంబారట్టు పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాయత్రి గ్రానైట్స్ సౌజన్యంతో, పలువురు దాతల సహకారంతో ఆలయంలో సాయంత్రం పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, వద్దిరాజు వెంకన్న, దేవేందర్, ధన్నసరి సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, నారాయణరావు, ఊకంటి యాకుబ్‌రెడ్డి, దుర్గేష్, బోగోజు నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల ప్రచారం

గూడూరు: మండల కేంద్రంలో శనివారం రథ సప్తమిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల ఆశీస్సులతో ఆదిత్య గ్రంథము, భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథముల హిందూ ప్రచారం నిర్వహించినట్లు జ్ఞానవేదిక వరంగల్ కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాష్ తెలిపారు.

పిల్లల చదువుపై దృష్టి అవసరం

తొర్రూరు: పిల్లల చదువుపై తల్లిదండ్రుల దృష్టి అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పిల్లలను సన్మార్గంలో నడపడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు రోహిణి, వెంకన్న, అంజు, విజయ్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం

గూడూరు: ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటిస్తూ రుచికరమైన ఆహారంతోపాటు కాచి వడబోసిన మంచినీరు తాగితే ఆరోగ్యంగా ఉంటారని హోమియో వైద్యురాలు రజిత అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అన్సారీ, పద్మ, ఇందుమతి, మనోహర్, సుకన్య, సంజీవరావు పాల్గొన్నారు.

అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలి



కురవి: ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కురవి: అదనపు వినియోగపు డిపాజిట్ పేరుతో ఏసీడీ బిల్లుల విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో విద్యుత్ రెవెన్యూ(ఈఆర్ఓ) కార్యాలయం ఎదుట ఏసీడీ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు పోగుల శ్రీనివాస్‌గౌడ్, తురక రమేష్, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: విద్యుత్ వినియోగదారులపై విధిస్తున్న అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్‌శాఖ వినియోగదారులపై మోపుతున్న డెవలప్‌మెంట్ చార్జీలు, ఇతర అదనపు చార్జీలపై ఈనెల 31న జిల్లా, మండల కేంద్రాల్లో ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు.

'వీరన్న' సేవా రథానికి పూజలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో శనివారం వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి సేవా రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురవికి చెందిన గ్యాస్ ఏజెన్సీ యజమాని గోలి అశోక్-సునీత దంపతుల కుమారుడు గోలి అఖిల్ జ్ఞాపకార్థం రూ.4లక్షల వ్యయంతో టేకు కలపతో నిర్మించిన వీరన్న సేవా రథాన్ని ఆలయ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్, ధర్మకర్తలు చిత్తనూరి మల్లయ్య, మేక నాగిరెడ్డి, రథం తయారీదారుడు అనుముల పూర్ణాచారి, ఆలయ సిబ్బంది రవి, బాదె వెంకన్న, సమ్మయ్య, నవీన్, పూజారులు పాల్గొన్నారు.

శ్రీకంఠమహేశ్వరస్వామి వేడుకలు



మహబూబాబాద్ రూరల్: పూజలో పాల్గొన్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: శ్రీకంఠమహేశ్వరస్వామి (కాటమయ్య), సురమాంబ అమ్మవార్ల పండుగ వేడుకలు మహబూబాబాద్ మండలంలోని నడివాడ గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పెదగాని నర్మదగుట్టయ్యగౌడ్, గీత కార్మికులు ఆధ్వర్యంలో బ్యాండ్ వాయిద్యాలతో వచ్చి జలాభిషేకం చేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బోనాలు..

కురవి: మండలంలోని మోద్గులగుడెం గ్రామంలో కంఠమహేశ్వరస్వామి బోనాల పండుగ వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటి నుంచి బోనాలను ఎత్తుకొని ఆలయం వద్దకు వెళ్లారు. స్వామివారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్ల పల్లి గ్రామంలో 42 ఇళ్లకు ప్రధాన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల యాజమానులు శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ టి.ప్రసన్నరాణికి వినతిపత్రం అందజేశారు. వెంటనే మున్సిపాలిటీ నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేషపల్లి నవీన్, వెంకన్న, ఉమా, లక్ష్మినర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హామీలు అమలు చేయాలి

డోర్నకల్: సీఎం కేసీఆర్ వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మండల వీఆర్ఏ జేఏసీ చైర్మన్ ఆలేటి బాలకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 1, 2వ తేదీలలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న మౌన దీక్షను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సాయిరామ్, సురేష్ పాల్గొన్నారు.

భూమిపూజ

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో ఫిబ్రవరి 14నుంచి 17వరకు నిర్వహించనున్న బొడ్రాయి, ముత్యాలమ్మ, ధ్వజస్తంభం, యాగశాల ప్రతిష్ఠాపన పనులకు శనివారం భూమిపూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట సంజీవరెడ్డి, ఎల్లాగౌడ్, బాలకృష్ణారెడ్డి, రవీందర్‌గౌడ్, అనంతరాములు పాల్గొన్నారు.

నిలిచిన నీటి సరఫరా

దంతాలపల్లి: దంతాలపల్లి మండలకేంద్రం మొదటి వార్డులో 10 రోజులనుంచి వార్డుకు నీటి సరఫరా నిలిచి పోయిందని శనివారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైన కార్యదర్శి, సర్పంచ్ వంటనే స్పందించి నీరు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సుభద్ర, లక్ష్మి, నర్సమ్మ, రజిత, వెంకటమ్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్ల అందజేత



కేసముద్రం: కేసముద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలకు, గాయత్రి గ్రానైట్స్ ప్రతినిధులు వద్దిరాజు కిషన్, రాజ్యసభసభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సోదరులు తమ తల్లిదండ్రులు వెంకటనర్సమ్మ, నారాయణ జ్ఞాపకార్థకంగా శనివారం 20 సీలింగ్ ఫ్యాన్‌లను, 10 ట్యూబ్‌లైట్‌లను అందజేసినట్లు పాఠశాల ప్రత్యేక అధికారిని నీలిమా తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం గ్రామంలో ఫిబ్రవరి 3నుంచి 5వరకు నిర్వహించే మహాగణపతి స్థిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కట్యూరి నరేందర్‌రెడ్డి, అజ్మీర హరినాయక్, ఉపసర్పంచ్ చింతల లింగయ్య, రంగయ్య, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా నాగేంద్రబాబు



గార్ల: కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నాగేంద్రబాబును నియమిస్తూ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు నాగేంద్రబాబు శనివారం గార్లలో ఉత్తర్వు కాపీలను విడుదల చేశారు.

జయప్రదం చేయండి

బయ్యారం: ఈనెల 29న జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రామిక మహిళా జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడారు. నాయకులు వెంకన్న, లతీఫ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సమ్మెట రాజమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీఓ శేషాద్రికి కార్మికులతో కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. బాబు, యాకన్న, రాంబాబు, వెంకటమ్మ, నిర్మల, శ్రీను పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గార్ల: మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి దేవాలయంను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య శనివారం సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌చంద్ కోరం కనకయ్యను ఆలయానికి సాదరంగా ఆహ్వానించి అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ ఎం.శివాజీచౌహాన్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

అవకతవకలను అరికట్టాలి

కురవి: ఉపాధ్యాయుల బదిలీల్లో అవకతవకలను అరికట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తట్టుపల్లి యూపీఎస్, నేరడ హైస్కూల్‌లో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

బాలికకు అస్వస్థత

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఊరుగొండ భవాని శనివారం స్కూల్‌లో అస్వస్థతకు గురై కిందపడిపోయింది. వెంటనే 108లో మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

వృద్ధుడికి గాయాలు

డోర్నకల్: గార్లకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఎండీ అజీముద్దీన్ ద్విచక్ర వాహనంపై డోర్నకల్‌కు వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అజీముద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గార్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

గార్ల: హక్కుల సాధన కోసం యాదవులు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యాదవుల జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ యాదవ మహాసభ యూత్ మండల అధ్యక్షుడిగా కుక్కల నరేష్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో గజ్జి రామయ్య యాదవ్, ఉపసర్పంచ్ నాగరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నర్సింహులపేట: మండల కేంద్రంలోని బొల్లం కమలాకర్ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును శనివారం బాధితుడికి మాజీ సర్పంచ్ బండ బిక్షంరెడ్డి అందజేశారు.

గార్ల: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ ఫలాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టి సాధించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. గార్లకు చెందిన శ్రీరామశాస్త్రి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హరిప్రియ ఆదేశాల మేరకు శనివారం ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, లచ్చునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్:
9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్, (S.R): 7997958185
ఎం. మురళి, (S.R)(తొర్రూరు): 7680822646